క్లుప్తంగా

భక్తిభావం కలిగిఉండాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



పడిపూజలో పాల్గొన్న స్వాములు

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో ఆదివారం శివస్వాములు మహాపడి పూజను నిర్వహించారు. గురుస్వామి కుమార్ ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలం..

బయలుదేరిన శివస్వాములు



ఆమనగల్లు: శివస్వాములు ఆమనగల్లు నుంచి శ్రీశైలం దేవస్థానానికి ఆదివారం కాలినడకన బయలుదేరారు. ముందుగా ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి ఆలయంలో శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం శివస్వాములు గణేశ్, అమర్, సాయి, మహేశ్, శివ, అంజి, నిఖిల్, వేణు, చింటు, వినోద్, అరవింద్, వికాస్, నందు తదితరులు కాలినడకన శ్రీశైలం బయలుదేరి వెళ్లారు.

నాగారం మదర్సా అభివృద్ధికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: నాగారం మదర్సా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో గల మదర్సాలో విద్యార్థుల జల్సా దస్టర్ బండి అరేబియా నూర్ ఉల్ ఉలోం కార్యక్రమానికి ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని త్వరితగతంగా పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు నాగారం మదర్సా కమిటీ సభ్యులు, మైనార్టీ విద్యార్థులు అనితారెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పీఏసీఎస్‌చైర్‌పర్సన్ పాండు యాదవ్, మాజీ సర్పంచ్‌లు లావణ్యలింగం, కావలి దశరథ, నాయకులు రాఘవేందర్ గౌడ్, సిద్దుల్‌గౌడ్, అన్వర్‌ఖాన్, అజాం, గౌస్‌ఖాన్, అంజద్‌ఖాన్, హాజీఖాన్, ఫిరోజ్ ఖాన్, షాఖేర్, ఖాజా పాషా, బాబ్జానీ, హబీబ్, మదర్సా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ జరిపించండి: శంకర్‌నాయక్

సైదాబాద్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంచే లక్ష్యంతో ఏర్పడిన భూదాన్ బోర్డును అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన బోర్డ్ మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డిపై ప్రభుత్వం సీబీఐచే విచారణ జరిపించాలని తెలంగాణ సర్వోదయా మండలి అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య భవన్‌లో నిర్వహించిన సర్వోదయ మండలి హైదరాబాద్ మహాసభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సమావేశంలో సర్వోదయ మండలి హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలి హైదరాబాద్ అధ్యక్షుడిగా రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ గౌస్, ఉపాధ్యక్షుడిగా మునీరుద్దీన్, ప్రతినిధిగా షేక్ మహమూద్ ఎన్నికైనారు. రఘుపతి నాయక్, జంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

నాగోలు: ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులను ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- మూడురోజుల పాటు వేడుకలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న శివాలయం

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి శివాలయంలో కొలువైయున్న కాశీవిశ్వనాథస్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినాన్ని ఇక్కడ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా క్షేత్ర సాంప్రదాయానుసారంగా జపహోమ పూజలు, అభిషేక అర్చనాది సేవలు, ఆగమ శాస్త్రానుసారంగా ఈనెల 7వ తేది గురువారం ప్రారంభమై 9వ తేదీ శనివారం వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహణ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు తరలిరానుండటంతో శివాలయాన్ని శోభాయామానంగా అలంకరిస్తున్నారు.

ఆలయ చరిత్ర..

మైసిగండిలో ప్రస్తుత శివాలయ, రామాలయ దేవాలయాలు.. రుగ్వేద కాలంలో గంగా గుళ్లుగా పిలువబడేవని ఆలయ చరిత్ర తెలుపుతుంది. వందల, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయ, రామాలయాలు గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న, మాదన్నల మహామంత్రులుగా ఉన్న సమయంలో నిత్యం విశేష పూజలు జరిగేవని చరిత్ర తెలుపుతున్నది. తర్వాతి కాలంలో జీర్ణించుకుపోయిన శివాలయ రామాలయాలను, పునర్ నిర్మించేందుకు దివంగత ఆమనగల్లు ఎంపీపీ అప్పటి ఆలయ ట్రస్టీ ఆర్.పంతునాయక్ ఎంతో కృషి చేశారు. పురాతన ఋగ్వేదకాలం నాటి ఆలయాన్ని దాతలు, ప్రభుత్వ సహకారంతో పునఃనిర్మాణం చేపట్టారు. 23సంవత్సరాల క్రితం పునఃనిర్మాణం జరిగిన ఆలయం నేడు నిత్యం భక్తుల తాకిడితో దేదీప్యామానంగా వెలుగొందుతోంది. ఆలయ పరిసరాలలో ఉన్న కోనేరుగంగలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే రోగాలు, పాపభీతి తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం, నమ్మకం.

ఏర్పాట్లు పూర్తిచేశాం



స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు తాగునీటి వసతి, ఇతర సౌకర్యాలను కల్పిస్తాం. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజు నవ గ్రహ హోమం, గణపతి హోమం నిర్వహిస్తాం.

– స్నేహలత, ఈఓ, శివరామాలయం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రభుత్వ బాలుర పాఠశాల 2003-04 బ్యాచ్ విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకట నర్సింహ గార్డెన్స్‌లో ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 2003–04 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు.. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి పూర్వ విద్యార్థులు కృష్ణయాదవ్, చెన్నకేశవులు, రమేశ్, ఎర్రవోలు శ్రీను, కృష్ణ, శేఖర్, నర్సింహ, నాగులు, వెంకటేశ్, రంజిత్, అల్లాజీ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పర్యావరణ బాలచైతన్య కేంద్ర నిర్వాహకుడు రజనీకాంత్



విద్యార్థుల యోగా ప్రదర్శన

కడ్తాల్: యోగాసనాలతో ఆరోగ్యమయ జీవనం సాధించవచ్చని పర్యావరణ బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చరికొండలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో బాల చైతన్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల యోగాసనాల ప్రదర్శన, వృద్ధులకు, రైతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బాలచైతన్య కేంద్రం గ్రామ ఇన్‌చార్జి మమత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. వృద్ధులు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. వృద్ధుల పట్ల పిల్లలు ప్రేమ, గౌరవం కలిగి ఉండాలని అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం వృద్ధులను, రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, ఉమా, నాగరాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘లయన్స్’ సేవలు అభినందనీయం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త సహకారంతో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది వేసవిలో 100 రోజుల పాటు రాగి అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. వేసవికాలంలో పేద ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశ్యంతో రాగి అంబలిని ఉచితంగా అందించడం అభినందనీయమని అన్నారు. రాగి అంబలి కేంద్రం నిరుపేదలకు, వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. లయన్స్ క్లబ్‌తో పాటు, స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, లయన్స్ క్లబ్ సభ్యులు బీచ్యానాయక్, గంప శ్రీనివాస్, భిక్షపతి, లక్ష్మయ్య, రాజేందర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, వీరయ్య, లాయక్‌అలీ, రామకృష్ణ, మల్లప్ప ఉన్నారు.

8న బ్యాడ్మింటన్ టోర్నీ

హయత్‌నగర్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా గజ్జి యాదయ్య, రాజమ్మయాదవ్ జ్ఞాపకార్థం ఈనెల 8వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ ఉదయం వరకు హయత్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రత్యేక షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గజ్జి నర్సింహ యాదవ్ తెలిపారు. ఈ టోర్నీలో విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతులు ఇస్తామని నగరంలోని నాన్ మెడలిస్టు క్రీడాకారులందరూ ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మెన్స్ డబుల్, 45 ప్లస్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు ఈ నెల 7 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఫోన్ నం. 9704541579లో సంప్రదించవచ్చన్నారు.

సైదాబాద్‌లో నర్స్ అదృశ్యం

సైదాబాద్: ప్రైవేట్ ఆసుపత్రిలో నర్స్‌గా పని చేస్తున్న ఓ మహిళ కనిపించకుండా పోయింది. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం... సింగరేణి కాలనీలో నివసించే బి.రవి ప్రైవేట్ ఫార్మసీలో పని చేస్తున్నాడు. అతని భార్య లావణ్య(24) మూడేళ్లుగా నర్స్‌గా పని చేస్తోంది. శనివారం రాత్రి రవి విధులు ముగించుకొని ఇంటికి వచ్చే సరికి ఇంట్లో భార్య కనిపించలేదు. శనివారం హాస్పిటల్‌కు వెళ్లిన ఆమె విధులు ముగించుకొని ఇంటికి వచ్చి.. మళ్లీ బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త రవి ఆదివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

జెడ్పీటీసీ మహిపాల్

ఇబ్రహీంపట్నం రూరల్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ మహిపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో గత కొద్ది రోజులుగా పల్లె రజనీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిబట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీలో మహాత్మ యూత్ మొదటి బహుమతి సాధించి రూ.44,444 నగదు, ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, పల్లె బాల్‌రాజ్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, శంకర్‌గౌడ్, సాయిబాబగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తులేకలాన్‌లో ఎంఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ మహిపాల్ ప్రారంభించారు. మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, రమేష్, కరుణాకర్, సత్తు శశాంక్‌రెడ్డి, జగదీష్, శంకర్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం



ఆమనగల్లు: పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ నరేందర్



కడ్తాల్: పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



తుర్కయంజాల్: చుక్కలు వేస్తున్న కౌన్సిలర్ కల్యాణ్ నాయక్



యాచారం: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ లక్ష్మమ్మ



తలకొండపల్లి: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ నిర్మల



ఇబ్రహీంపట్నం రూరల్: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ మంగ

- పల్స్ పోలియో కార్యక్రమంలో నేతలు
- ముమ్మరంగా చుక్కల మందు పంపిణీ

యాచారం: చిన్నారుల ఆరోగ్యం అందరి బాధ్యతని చింతపట్ల, మొండిగౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ అన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంపీపీ తిర్మణి నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య సిబ్బంది చిన్నారులకు పోలి యో చుక్కల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీతో పాటు మాజీ సర్పంచ్ లలిత, డాక్టర్ స్నేహతో కలిసి ఆమె చిన్నారులకు పోలియో చుక్క లు వేశారు. కార్యక్రమంలో లక్ష్మీ నర్సింహారెడ్డి, జ్యోతయ్య, శ్రీశైలంగౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలో 32 కేంద్రాలు, 3 మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. 3,500 మంది చిన్నారులు ఉండగా దాదాపు 3,300 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే.. మాడ్గుల మండలంలో 2,250 మంది చిన్నారులకు గాను 2,032 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు మాడ్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.మోహన్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

తప్పనిసరిగా వేయించాలి

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. పోలియోను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు నర్సింహ, బీచ్యానాయక్, జహంగీర్‌అలీ, లాయక్‌అలీ, గంపశ్రీను, రాజేశ్, డాక్టర్ కిరణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని 23, 24వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

మంచాల మండలంలో..

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం 72 శాతం పల్స్ పోలియో చుక్కలు వేశామని.. మిగత వారికి రెండు రోజుల వ్యవధిలో వేస్తామని మంచాల పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కిరణ్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పోలియో చుక్కల పంపిణీలో పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 98శాతం మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. 37,649 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు గాను 37,115 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని ఇందుకోసం 100 బూతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పిల్లలందరికీ వేయించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: ఐదు సంవత్సరాల లోపు పిల్లందరికీ పోలియో చుక్కలు వేయించాలని పోల్కంపల్లి ఎంపీటీసీ మంగ పేర్కొన్నారు. ఆదివారం పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ఎన్గల్‌గూడ, మన్నెగూడ, జాజోనిబావి గ్రామాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత

చైతన్యపురి: నలుగురు మిత్ర బృందం పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు అందజేశారు. చైతన్యపురి డివిజన్‌లోని ఆదర్శ ఫౌండేషన్‌లో ఉంటున్న అనాథ పిల్లలు స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న స్థానిక బీఆర్‌ఎస్ డివిజన్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి తన మిత్రులు గంగాపురం ప్రసాదరెడ్డి, సంతోష్ గుప్తా, నరేందర్, సూర్యలతో కలిసి రూ. 45 వేలు వసతి గృహం ఇన్‌చార్జి జకియా ఫాతీమా, ప్రదీప్‌లకు అందజేశారు. పేద విద్యార్థుల చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానికులు కృష్ణ, సంతోష్‌యాదవ్, నవీన్ పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో విద్యార్థులకు పోటీలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థినీ విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, చేవేళ్ల, పరిగి తదితర జిల్లాలలోని శిశుమందిర్ పాఠశాలల విద్యార్థుల మధ్య భాగ్యనగర్ వైభవ్ పేరుతో కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జట్లకు, విద్యార్థులకు కీర్తి శేషులు పెద్దబావి పార్వతమ్మ జ్ఞాపకార్థం మెమెంటోలు, షీల్డులు అందజేశారు. పోటీల్లో 329 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విభాగ్ పౌర సంబంధాల ప్రముఖ్ పుష్పల వెంకటేశ్వర్‌రావు, పాఠశాల కార్యదర్శి దొడ్డి మల్లికార్జున్, విభాగ్ ఖేల్‌కూద్ ప్రముఖ్ ప్రేమ్ కుమార్, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాసోజు భూషణ్, పెద్దబావి సమరసింహారెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి, హైదరాబాద్ జిల్లా సహ కార్యదర్శి ఎ.కృష్ణారెడ్డి,డి.శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రబంధకులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386